**Andhra Jyothi**

# ఉపాధి కల్పనలో టాప్-5లో ఏపీ!

- **భవిష్యత్తులోనూ పెరగనున్న అవకాశాలు**
- **ఫిక్కీ- కేపీఎంజీ నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనలో అగ్రస్థానంలో ఉన్న ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని ఫిక్కీ - కేపీఎంజీ నివేదిక వెల్లడించింది. భవిష్యత్తులోనూ నవ్యాంధ్రలో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. అధ్యయన వివరాలతో కూడిన నివేదికను ఫిక్కీ- కేపీఎంజీ శుక్రవారం ఢిల్లీలో విడుదల చేసింది. 2014 - 15 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ కలిపి 57 శాతం మందికి ఉపాధి కల్పించాయని తెలిపింది. భవిష్యత్‌లో దేశంలో వృద్ధి సాధించే కీలక రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని నివేదిక వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లో వృద్ధి బాగుంటుందని అంచనా వేసింది. ఈ రాష్ట్రాలన్నీ భారీ ఆర్థిక వ్యవస్థలని నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా.. మేఘాలయ, మధ్యప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ కూడా 2013-14 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక జీఎస్‌డీపీని నమోదు చేశాయని వివరించింది. బిహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మేఘాలయ, ఢిల్లీ, సిక్కిం రాష్ట్రాలు గత ఐదేళ్లుగా నిలకడగా ఎక్కువ వృద్ధిరేటును నమోదు చేస్తున్నాయని వెల్లడించింది. 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉపాధి కల్పనలో టాప్ - 10 రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. రాష్ట్ర విభజన అనంతరం 2015లో ఉపాధి కల్పనలో నవ్యాంధ్ర టాప్-5 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. భారతదేశంలో పది రాష్ట్రాల్లోనే 85 శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, అందులో ఆరు రాష్ట్రాల్లో ఏటా 20 శాతానికి పైగా ఉపాధి అవకాశాల్లో వృద్ధి నమోదవుతోందని తెలిపింది.

దేశ జీడీపీ గత కొంత కాలంగా 7 శాతానికి మించి వృద్ధి రేటును సాధిస్తుండటం ఉపాధికి ఊతమిచ్చే అంశమని, ప్రపంచం మొత్తం మానవ వనరుల సగటు వయస్సు పెరుగుతున్న సమయంలో భారతదేశంలో యువతకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. అయితే, ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే డిమాండ్‌కు తగినట్లుగా నైపుణ్యాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుందని, ఇదొక్కటే అవరోధంగా పరిణమించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గడచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వ విధానాలు, సంస్కరణల్లో జాప్యం వల్ల వృద్ధి మందగించిందని, కానీ, గత 2-3 ఏళ్లలో ప్రభుత్వ విధానాలు, సంస్కరణలు ఆర్థిక రంగ బలోపేతానికి సహకరించాయని తెలిపింది. యువ భారతం, అందులోనూ పట్టణీకరణ వేగంగా జరుగుతున్న దేశం కాబట్టి గృహ వినియోగ అవసరాలు ఆకర్షణీయంగా ఉంటాయని, దీని వల్ల ఆర్థిక వృద్ధి నిలకడగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఖర్చు చేయగలిగిన, వస్తువులు కొనగలిగిన మధ్యతరగతి జనాభా పెరుగుతోందని పేర్కొంది. దేశంలో పట్టణాల్లో కంటే గ్రామాల్లోని వారే పనిలో ముందున్నారని ఈ నివేదిక తెలిపింది. పట్టణాల్లోని పురుషులు 70 శాతం మంది పని చేస్తుండగా గ్రామాల్లో 73 శాతం మంది పురుషులు పని చేస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. మహిళల విషయానికొస్తే పట్టణాల్లో 12 శాతం మంది పని చేస్తుండగా.. గ్రామాల్లో 25% మంది పని చేస్తున్నారని తెలిపింది.